ఈనాడు
ములుగు
శుక్రవారం సెప్టెంబరు 27, 2024

త్వరితగతిన పనులు పూర్తి చేయించండి



సీఈ శంకర్‌తో మాట్లాడుతున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో మంజూరైన ఇంజినీరింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని పీవో చిత్రా మిశ్రా గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ చీఫ్ ఇంజినీర్ శంకర్‌ను కోరారు. గురువారం సాయంత్రం ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న పలు ఇంజినీరింగ్ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో పీవోతో చర్చించారు. కేటాయించిన అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రగతిలో ఉన్నవి, ప్రారంభించన వాటి వివరాలు పీవోకు వివరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ సక్రమంగా చేపడుతూ.. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కోరారు.

శుద్ధజలం సరఫరాలో నిర్లక్ష్యం సరికాదు



అవగాహన కల్పిస్తున్న డీఈఈ వెంకటసతీశ్, ఏఈఈ శ్రీనివాసరావు

వెంకటాపురం, న్యూస్‌టుడే: పల్లెల్లో శుద్ధజలం సరఫరాలో నిర్లక్ష్యం సరికాదని ఏటూరునాగారం ఇంట్రా విభాగం డీఈఈ వెంకటసతీశ్ అన్నారు. మంచినీటి సరఫరాపై వెంకటాపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంపు అపరేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పైపులైన్ల లీకేజీ, ఇంటింటి నల్లా కనెక్షన్ల తీరు, లీకేజీలు, గేట్‌వాల్వ్‌ల మరమ్మతులు, నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాగునీటితోనే ప్రజారోగ్యం ఆధారపడి ఉన్న దృష్ట్యా క్షేత్రస్థాయి యంత్రాంగం విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి వనరులను పరీక్షించుకోవడంతో పాటు మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మిషన్ భగీరథ ఇంట్రా విభాగం ఏఈఈ శ్రీనివాసరావు, పంచాయతీ పరిధిలోని సహాయకులు పాల్గొన్నారు.

నలుదిశలా.. ఘనకీర్తి చాటేలా!

● పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు..

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం..



ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి, ఈనాడు వరంగల్

పర్యాటక ప్రాంతాల్లో అపరిశుభ్రత, ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకుపోవడం ప్రకృతి ప్రేమికులను ఆందోళనకు గురిచేస్తోంది. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో గురువారం 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. యువత, వాకర్స్, విద్యార్థుల సహకారంతో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించింది. విద్యార్థులు కట్టడాల ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు. స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ.. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యాటక ప్రాంతాలను కాపాడుకుంటామని ప్రతినబూనారు.

ప్రకృతిహితం



ఖిలావరంగల్, వరంగల్ జిల్లా

● **కార్యక్రమం:** పర్యాటక ప్రాంతాలు కాలుష్యమయం కాకుండా ఉండేందుకు ప్రకృతిహితంగా సైకిల్‌పై వెళ్లి సందర్శించడం, సమీపంలో ఉంటే నడక ద్వారా చూడటం. సైక్లిస్టులు ఉదయం 6 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ముందు సైక్లింగ్ ప్రారంభించి, సుమారు 15 కి.మీ. దూరంలోని వరంగల్ కోటకు చేరుకున్నారు. ఈ ప్రదేశంలో సైకిల్‌పై తిరుగుతూ కీర్తి తోరణాలు, ఖుష్ మహల్ ఇతర ప్రదేశాలను సందర్శించారు. అనంతరం వాకర్స్‌తో కలిసి రాతి గోడ వరకు నడుస్తూ పర్యాటక ప్రాంతాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం కట్టడికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు.

● **పాల్గొన్న వారు:** ట్రైసిటీ రైడర్స్ వరంగల్ అసోసియేషన్ సభ్యులు జయరాజ్, విద్యాసాగర్, ప్రసాద్, రవికుమార్, వెంకటేశ్వర్లు, సదాశివరెడ్డి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, సైక్లిస్టులు, ఖిలా వరంగల్‌లోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 60 మంది

● **సందేశం:** కాలుష్యం బారి నుంచి పర్యాటక ప్రాంతాలకు విముక్తి

అవగాహన



ఇనుగుర్తిలోని కాకతీయుల శిలా శాసనాలు: మహబూబాబాద్ ● కాకతీయులు నిర్మించిన శాసనాలను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన ● జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.యాకయ్య, బి.దేవేందర్ ● భావితరాలకు కాకతీయుల శిలా శాసనాలను అందించాలి. - ఇనుగుర్తి (కేసముద్రం)

శ్రమదానం



కాళేశ్వరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● కాళేశ్వరం హరిత హోటల్ సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించడం ● హరితా సిబ్బంది, మేనేజర్ జక్కం సురేష్ ● శ్రమదానం చేద్దాం. . పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం..– కాళేశ్వరం

చైతన్యం





శ్రీ వేంకటేశ్వర స్వామి సమేత పద్మావతి, అలివేలుమంగమ్మ ఆలయం మహబూబాబాద్ జిల్లా ● ఆలయ విశిష్టతపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన ● ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.శేఖర్, ఎస్సై మాలోత్ సురేష్, ఆలయ అర్చకులు నందనాచార్యులు, రాంబాబుచార్యులు, ఎంపీపీ యాకయ్య ● ఆలయాలు, పర్యాటక ప్రాంతాలపై అవగాహన అవసరం – నర్సింహులపేట (డోర్నకల్)

స్వచ్ఛత



పాండవుల గుట్టలు రేగొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● పాండవుల గుట్టల్లో, గుట్టల కింద భాగంలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు ● గ్రామస్థులు, యువకులు ● పాండవుల గుట్టలను అభివృద్ధి చేస్తే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుంది. సందర్శనకొచ్చే వారు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలి. – రేగొండ


బాధ్యత



రామప్ప ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపు ● పాలంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానికులు ● రామప్ప పరిసరాలు శుభ్రత సామాజిక బాధ్యత

– వెంకటాపూర్

పరిశుభ్రత



బొగత జలపాతం ములుగు జిల్లా ● పిల్లల పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు ● అటవీ, జలపాతం రక్షణ సిబ్బంది ● స్వచ్ఛత పాటిద్దాం, పచ్చదనం పెంచుదాం, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యానికి భద్రత – వాజేడు

ప్లాస్టిక్‌పై యుద్ధం



లక్నవరం జలాశయం, ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ● బుస్సాపూర్ మాజీ ఉప సర్పంచి బేతి దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పాశం మాధవరెడ్డి, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది ● పర్యావరణాన్ని రక్షిస్తే మనల్ని మనం కాపాడుకున్నట్లే.. భావితరాలకు బతుకునిచ్చినట్లే. – గోవిందరావుపేట

ములుగు జిల్లాకు సెంట్రల్ మెడిసిన్ స్టోర్ మంజూరు

ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లాకు సెంట్రల్ మెడిసిన్ స్టోరు మంజూరైంది. ఈ మేరకు మందుల నిల్వకు అనువైన భవనాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ములుగు జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ గ్రామాలున్నాయి. జిల్లాలో 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 89 ఆరోగ్య ఉప కేంద్రాలుండగా, వీటికి మందుల సరఫరా ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం నుంచి జరుగుతుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులు అవసరం ఉన్నప్పుడు ఇండెంట్ పెడితే అవి పీహెచ్‌సీలకు చేరుకునే క్రమంలో జాప్యం జరుగుతోంది. వరంగల్‌లోని కేంద్రంలో వాహనం అందుబాటులో లేక పది నుంచి పదిహేను రోజులు పడుతుంది. ఇలాంటి సమస్యలు గుర్తించిన ప్రభుత్వం జిల్లాకు సెంట్రల్ మెడిసిన్ స్టోరును మంజూరు చేసింది. దీంతో మందుల కొరత లేకుండా అవసరాన్ని బట్టి ఔషధాలను ఆసుపత్రులకు తరలించుకునే అవకాశం ఏర్పడుతుంది. జిల్లాకు స్టోరు మంజూరైన నేపథ్యంలో మందులను ఎక్కడ నిల్వ చేయాలనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య ములుగులోని పలు ప్రదేశాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ములుగులోని గిరిజన భవనం, నూతనంగా నిర్మించిన జనరల్ ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి అనువైనదిగా నిర్ధారణకు వచ్చారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖకు ప్రతిపాదనలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నేటి నుంచి డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి అక్టోబర్ 5 వరకు హనుమకొండలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతుందని డీఈవో డి.వాసంతి గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 274 మంది అభ్యర్థులు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన వారు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఒప్పంద పద్ధతిలో వారిని ఉపాధ్యాయులుగా నియామకాలు చేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

డిగ్రీ పరీక్ష రుసుం గడువు అక్టోబర్ 5

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో నవంబరులో జరగనున్న డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) సెమిస్టర్ పరీక్ష రుసుం నోటిఫికేషన్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహచారి, అదనపు అధికారి తిరుమలదేవి గురువారం విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 5 వరకు, అపరాధ రుసుం రూ.50తో 15 వరకు చెల్లించొచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.kakatiya.ac.in లో చూడాలని సూచించారు.

యువజనోత్సవాలను విజయవంతం చేయాలి

ములుగు, న్యూస్‌టుడే: ములుగులోని గిరిజన భవన్‌లో ఈనెల 28న జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువజనోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా పాలనాధికారి టీఎస్.దివాకర అన్నారు. యువజనోత్సవాల నిర్వహణపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో దివాకర మాట్లాడారు. కళాకారులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అంశాల వారీగా బాధ్యత తీసుకోవాలని, అధికారులెవరూ గైర్హాజరు కావద్దన్నారు. 15 నుంచి 29 ఏళ్ల వయసు కలిగిన వారు ఎక్కువగా పాల్గొనే విధంగా చూడాలని, ఉదయం 9 నుంచి 11 గంటల సమయంలో పేర్లు నమోదు చేయాలన్నారు. ఉదయం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం నుంచి యువకీర్తి పోటీలను నిర్వహించాలన్నారు. సినిమా పాటలు నిషేధమని, గతంలో ప్రత్యక్ష ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కులం, మతం జాతి వర్గాన్ని కించపర్చే విధంగా ఉండొద్దని, జానపద నృత్యాలు, వ్యాసరచన, ఉపన్యాసం, యువ, సైన్స్, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

వయోవృద్ధుల వారోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ

అక్టోబర్ 1న నిర్వహించనున్న వాయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న వారోత్సవాల గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని వృద్ధాశ్రమాల్లో వయోవృద్ధులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు



విద్యార్థినుల చెస్ పోటీని ఆసక్తిగా తిలకిస్తున్న పాలనాధికారి దివాకర

ములుగు: విద్యార్థులు స్వచ్ఛతా సేవా హీ కార్యక్రమాల్లో పాల్గొనాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ దివాకర అన్నారు. మల్లంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా సేవా హీ కార్యక్రమం కింద నిర్వహించిన ఇండోర్ గేమ్స్‌లో విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీలను కలెక్టర్ తిలకించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లక్ష్యంతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన జరగాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నిల్వ నీటితోనే దోమలు వృద్ధి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి అప్పయ్య

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: ఇళ్లలో ఆరుబయట ఉండే పాత్రలు, బక్కెట్లు, ఇతర వస్తువుల్లో నిల్వ ఉండే నీటితోనే దోమలు వ్యాప్తి చెందుతాయని జిల్లా వైద్యాధికారి అప్పయ్య చెప్పారు. వ్యాధుల పట్ల అవగాహన కల్గి ఉండాలన్నారు. గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో గురువారం వైద్యాధికారిణి సుహాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని అప్పయ్య సందర్శించారు. అప్పటి వరకు 52 మందికి పరీక్షలు చేయగా అందులో ఐదుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అనంతరం గ్రామంలో అభ్యుదయ కాలనీలో ఆయన 15 ఇళ్లను పరిశీలించారు. 10 ఇళ్లలో ఉన్న నిల్వ నీటిలో లార్వా ఉండడాన్ని గుర్తించి, ఇంటి యజమానులకు చూపించారు. ఆరుబయట ఉండే నిల్వ నీటిని మూడు రోజులు దాటితే పారబోయాలని గ్రామస్థులకు తెలిపారు. దోమల నివారణకు దోమతెరలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థినులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే మహిళలు ఆరోగ్యంగా ఉంటారని ఏటూరునాగారం సీడీపీవో ప్రేమలత సూచించారు. గురువారం ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు సమతుల్యాహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనిస్తారని తెలిపారు. విద్యార్థినులు అందుబాటులో ఉండే పోషకాహారంపై, వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రేణుక, కళాశాల మహిళా సాధికారత విభాగం సంధాత(కన్వీనర్) కనీస్ ఫాతిమా, అధ్యాపకులు డి.నవీన్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త వెంకటయ్య, జ్యోతి, జీవవేణి, సుమలత, భావన, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై పర్యవేక్షణ అవసరం

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి లక్ష్మణ్‌నాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తొలుత బాలికల వసతి గృహాన్ని, అనంతరం బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించారు. పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందుతోందా? వసతి గృహ సంక్షేమాధికారి స్థానికంగా ఉంటున్నారా? తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 6.30 గంటల తర్వాత వసతి గృహం నుంచి బయటకు వెళ్లొద్దని విద్యార్థులకు సూచించారు. వసతిగృహాధికారులు స్థానికంగా ఉంటూ పిల్లలను నిత్యం పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు బయటకు వెళ్తే వార్డెన్లు, సిబ్బందిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

రామప్ప దేవాలయాన్ని కాపాడుకోవాలి

ములుగు, న్యూస్‌టుడే: ప్రపంచ వారసత్వ సంపదైనటువంటి రామప్పను కాపాడుకోవాలని భారాస జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామప్పకు సమీపంలో ఓపెన్ కాస్ట్ గని తవ్వకంలో భాగంగా పేలుళ్లు జరపొద్దన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వ్యవహరించాలని, లేదంటే భారాస ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గొల్లాల గుడిలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపి శివలింగాన్ని తొలగించడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

రుణమాఫీకి అన్నదాతల నిరీక్షణ..!



మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు(పాతచిత్రం)

ములుగు, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అర్హత ఉన్నా.. మాఫీ వర్తించని రైతులకు ఎదురుచూపులతోనే కాలం గడిచిపోతోంది. రుణమాఫీ కోసం ఆయా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో వేల సంఖ్యలో మాఫీ వర్తించని రైతులు కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఇంత వరకు వాటి గురించి ఎలాంటి నిర్ణయం రాకపోవడంతో.. తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు.

వివిధ కారణాలతో వచ్చిన దరఖాస్తులు

రూ.2 లక్షల పైన రుణం ఉన్నవి: 340
సమాచార లోపంతో తిరస్కరించినవి: 335
ఆధార్ అనుసంధానం కానివి: 142
బ్యాంకు ఖాతాల్లో తేడాలున్నవి: 304
ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించినవి: 57
పట్టాపాసు బుక్కులేనివి: 274
బ్యాంకు ఖాతా మూసివేసినవి: 55
ఇతరత్రా సమస్యలు: 37

వేల సంఖ్యలో అర్జీలు

మాఫీకాని రైతులు వారి సమస్యను వివరిస్తూ.. వేల సంఖ్యలో రైతులు మండల వ్యవసాయాధికారుల వద్ద విన్నవించారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 2,436 మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.2 లక్షల పైన రుణం పొంది మాఫీ వర్తించని రైతులతో పాటు రూ.లక్ష, రూ.50 వేలు, రూ.1.50 లక్షల రుణమాఫీ జరగని అన్నదాతలున్నారు. వ్యవసాయ అధికారి కార్యాలయం, బ్యాంకు నుంచి ఎప్పుడు సమాచారం వస్తుందోనని వీరంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో వ్యవసాయ అధికారులు సైతం ఎలాంటి సమాచారం ఇవ్వలేకపోతున్నారు. రూ.2 లక్షల పైన రుణం ఉన్న కుటుంబాలకు సంబంధించి ప్రతి రోజు వ్యవసాయాధికారులు కుటుంబసభ్యులను ఏకం చేస్తూ ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇతర సమస్యలకు సంబంధించి ప్రభుత్వం ఒక యాప్‌ను విడుదల చేయాల్సి ఉండగా, అది ఇంత వరకు విడుదల కాకపోవడంతో కార్యాలయాల్లోనే దరఖాస్తులన్నీ మూలుగుతున్నాయి.

జిల్లాలో మండలాల వారీగా వివరాలు


మండలం	దరఖాస్తుల సంఖ్య
ములుగు	816
వెంకటాపూర్	485
ఏటూరునాగారం	200
కన్నాయిగూడెం	152
మంగపేట	339
గోవిందరావుపేట	85
తాడ్వాయి	153
వెంకటాపురం	177
వాజేడు	29

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముందుకెళ్తాం..

- సురేశ్, జిల్లా వ్యవసాయాధికారి

రుణమాఫీకి సంబంధించి కుటుంబసభ్యుల గ్రూపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇది చివరిదశకు చేరుకుంది. ఆధార్ అనుసంధానానికి సంబంధించి కొన్ని సమస్యలుంటే పరిష్కరించాం. రైతుల నుంచి వివిధ రకాల కారణాలతో మాఫీ వర్తించలేదని వచ్చిన దరఖాస్తులను భద్రపరుస్తున్నాం. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముందుకుసాగుతాం.

చెరువులోనే భవనం..!



● ధర్మసాగర్ జలాశయంలో ఏడాదిగా పనులు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములు కబ్జాకు గురవుతుండగా, తాజాగా నిర్మాణాలు ప్రారంభించారు.

ఈనాడు, వరంగల్, ధర్మసాగర్, న్యూస్‌టుడే

రాజధాని హైదరాబాద్‌లోని చెరువు శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు కనిపిస్తే 'హైడ్రా' కూల్చేస్తోంది. కొత్తగా వెలుస్తున్న నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తోంది. మన దగ్గర ఏకంగా జలాశయంలోనే భవనం నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

దేవాదుల ఎత్తిపోతల పథకానికి గుండెకాయ లాంటి ధర్మసాగర్ జలాశయం గ్రేటర్ వరంగల్ ప్రజల తాగునీటికి ప్రధాన వనరు. ఈ చెరువు శిఖంలోనే ఒక భవనాన్ని కట్టేశారు. ధర్మసాగర్ నుంచి ముప్పారం దారిలో ఉన్న జలాశయం శిఖం భూమిలో ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని ఏడాది కాలంగా చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ అడ్డుకోకపోవడం గమనార్హం.

పట్టాభూమైనా అనుమతి లేదు

అనేక గ్రామాల పరిధిలో చెరువు శిఖం భూముల్లో రైతులకు పట్టా భూములు ఉంటాయి. చెరువులో నీళ్లు లేనప్పుడు పంటలు వేసుకుంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ధర్మసాగర్ చెరువు శిఖంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. పట్టాగల భూమి జలాశయంలో ముంపునకు గురికాలేదని, వ్యవసాయ భూమిని 'నాలా' (వ్యవసాయేతర) భూమిగా మార్పిడి చేసుకున్నట్టు సమాచారం. మరో విడ్డూరం ఏంటంటే 'నాలా' కన్వర్షన్ తీసుకున్నది ఒక చోట కాగా.. ఇంటి నిర్మాణం జరిగింది మరో ప్రాంతంలో అని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం.

స్థానిక తహసీల్దార్ ఏమన్నారంటే..


ఇది పట్టా భూమి అని, ముంపునకు గురికాలేదని ఆధారాలను చూపించి, ఇందులో ఎలాంటి అభ్యంతరాలు లేవని, ఒకవేళ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని సంబంధిత రైతు డిక్లరేషన్ ఇస్తే నాలా కన్వర్షన్ చేశామని చెప్పారు..

● సంబంధిత యజమానిని 'ఈనాడు' ఫోన్‌లో వివరణ కోరగా ఈ భూమిని రైతు నుంచే కొనుగోలు చేశానని ..శిఖంలో లేదని తెలిపారు.

నోటీసులు జారీ

సాగునీటి పారుదల శాఖ అధికారులు ఇది అక్రమ నిర్మాణమే అని రెవెన్యూ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని అటు అధికారులకు, ఇటు ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో సర్వే నెంబర్ 1251లో ఇంటి నిర్మాణం జరుగుతుండగా తమకు గత ఏప్రిల్‌లో సమాచారం రాగా వెళ్లి పరిశీలించామని డీఈఈ ప్రశాంతి తెలిపారు. సంబంధిత యజమానికి నోటీసు ఇచ్చామని చెప్పారు. ఎఫ్‌టీఎల్‌లో లేదని, పట్టా భూమిగా చెబుతున్నారన్నారని.. దీనిపై పూర్తి నిర్ధారణ కోసం రెవెన్యూ, నీటిపారుదల శాఖ కలిసి సర్వే చేయడానికి తహసీల్దార్‌కు ఉత్తరం రాశామని అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు.

● ఇంటి నిర్మాణానికి అనుమతి లేదని, కూల్చివేయమని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కూడా లేఖ రాశామని పేర్కొన్నారు.



వరంగల్ బస్టాండ్ భవన సముదాయం (పాతచిత్రం)



కూల్చి వేసిన అనంతరం ఇలా..

ఉన్నది కూల్చారు.. నిర్మాణం మరిచారు!

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు ప్రస్తుతానికి ఆర్టీసీ బస్టాండ్ లేదు. ఓరుగల్లు రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో రెండున్నర ఎకరాల్లో ఉన్న పాత బస్టాండ్ భవన సముదాయాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో గతేడాది జూన్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ రూ.73.50 కోట్ల అంచనాతో కొత్త ప్రయాణ ప్రాంగణ నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అనంతరం పాత బస్టాండ్ నేలమట్టం చేశారు. ఏడాదిన్నర గడుస్తున్నా.. పనులు ప్రారంభించడం లేదు. పక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో ప్రయాణికులు ఎండావానల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే గిర్మాజిపేట

ఎన్‌సీసీ జాతీయ శిక్షణకు ఎంపిక



సాయిచందన్

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్) బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ బి.సాయిచందన్ జాతీయ శిక్షణకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ ఎన్.రమణ తెలిపారు. సెప్టెంబర్ 26 గురువారం నుంచి అక్టోబర్ 6 వరకు బెంగళూరులో 20 మందికి 'రేడియో కంట్రోలర్ ఇన్ ఏరో మోడలింగ్ డిజైన్'లో శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. శిక్షణకు బయలుదేరిని సాయిచందన్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి రాధిక, ఎన్‌సీసీ అధికారి అనిల్‌కుమార్ తదితరులు అభినందించారు.

శాస్త్రీయ పద్ధతుల్లో నేరాల దర్యాప్తు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే నేరాల దర్యాప్తు శాస్త్రీయ పద్ధతుల్లో చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఠాణాల వారీగా కేసుల నమోదు, విచారణ, నిందితుల అరెస్టు, కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి, డీజీపీ కార్యాలయం నుంచి వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, రౌడీ షీటర్లపై నిఘా పెంచాలని, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాల నివారణలపై చర్చించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా.. వంతెన పిల్లర్





ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్ - ఇల్లెందు ప్రధాన రహదారిలో బయ్యారం శివారులోగల పాకాలవాగు వంతెనలోని ఓ పిల్లర్ వద్ద భారీగా మట్టి కోతకు గురైంది. పిల్లర్ చుట్టూ సుమారు 8 అడుగుల లోతు గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వంతెన దిగువ భాగానికి వెళ్తున్న రైతులు పిల్లర్ వద్ద ఏర్పడిన గొయ్యిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఆర్‌అండ్‌బీ ఏఈఈ అనిల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పిల్లర్ వద్ద గొయ్యి పడిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి వంతెన జాతీయ రహదారి పరిధిలో ఉన్నందున సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

– న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)

పర్యావరణ ప్రేమికుడి ఒంటరి పోరాటం

'ఆయన ఒకసారి జాతిపిత గాంధీజీ వేషం వేస్తారు. మరోసారి మెడలో ప్లాస్టిక్ సీసాల దండలు వేసుకొని కనిపిస్తారు. ఇంకోసారి జెండా పట్టుకొని పాదయాత్ర చేస్తూ దారి వెంట వెళ్లేవారందరినీ పలకరిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసమే ఆయన తపనంతా.'



చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, చెరువులను కాలుష్య కాసారాలుగా చేయొద్దని ఒంటరి పోరాటం చేస్తున్నారు హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. వృత్తి రీత్యా ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నా.. ప్రవృత్తి మాత్రం పర్యావరణ పరిరక్షణే. అందుకే ఎక్కడ పర్యావరణ వినాశనం జరుగుతోందని తెలిసినా వెంటనే పాదయాత్రగా బయలుదేరి వెళ్లి దాన్ని ఆపాలంటూ గళమెత్తుతారు. –ఈనాడు, వరంగల్

చెరువుల్లోని వ్యర్థాలను ఏరివేస్తూ..

ప్రకృతిని కాపాడాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వాట్సప్ స్టేటస్‌లు పెట్టుకునేవారు, ఫేస్‌బుక్‌లలో పోస్టులు చేసేవారు బోలెడు మంది. ప్రకాశ్ అలా కాదు.. మనం ఆచరించాకే ఇతరులకు చెప్పాలంటారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం అయ్యాక ఓరుగల్లులోని చెరువుల వద్దకు వెళ్లారు. ఒక్కో చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాను తొలగించి గట్టుపై కుప్పలుగా పోశారు. వాటిని తీసుకెళ్లాలని బల్దియా సిబ్బందిని కోరారు. వరంగల్ చిన్నవడ్డెపల్లి చెరువు, హనుమకొండ పద్మాక్షి గుండం, కాజీపేట బంధం చెరువుల వద్దకు వెళ్లి తనకు అందినంత మేర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.



ఇటీవల నిమజ్జనం తర్వాత చెరువుల్లోని చెత్తను ఏరివేస్తూ..

● ఈ పర్యావరణ ప్రేమికుడు ప్రతి రెండేళ్లకోసారి మేడారం మహా జాతరకు పాదయాత్రగా వెళతారు. జాతరలో ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని కాపాడాలనే సందేశం ఇస్తూ నాలుగు రోజుల పాటు వనదేవతల వద్దకు నడక సాగిస్తారు. గత ఫిబ్రవరిలో జరిగిన జాతరకు వినూత్నంగా జాతిపిత గాంధీజీ వేషం ధరించి దారి వెంట కనిపించిన వారిని పలకరిస్తూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందంటూ సందేశం ఇచ్చారు. పాఠశాల పిల్లలకు అవగాహన కల్పిస్తూ ప్రయాణం సాగిస్తారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మెడలో ప్లాస్టిక్ సీసాలు ధరించి ప్లాస్టిక్ నిర్మూలనపై వైవిధ్యంగా అవగాహన కల్పించారు.

అలా మొదలు..

ప్రకాశ్ 10వ తరగతి వరకు ములుగు జిల్లా మంగపేటలో చదువుకున్నారు. ఆ సమయంలో బిల్ట్ పరిశ్రమ నుంచి కాలుష్యం బాగా వెలువడడంతో బిల్ట్ యాజమాన్యం అప్పుడప్పుడు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటేది. పాఠశాల స్థాయిలో ఆ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పెద్దయ్యాక అటవీ అధికారి పురుషోత్తంతో పరిచయం అయ్యాక పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరిగింది.

ఒక్కో అడుగు..

● 2018లో ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించకుండా పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించాలని పాదయాత్రగా వెళ్లి ఉత్సవ నిర్వాహకులను, కాలుష్య నియంత్రణ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

● వికారాబాద్ వద్ద జాతీయ రహదారి నిర్మాణం కోసం వెయ్యి మర్రిచెట్లను నరికేస్తారని తెలిసి ఓరుగల్లు నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం 'హైదరాబాద్ నేచర్ లవర్స్' సంస్థతో కలిసి చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి వృక్షాల హననాన్ని ఆపాలని ఫిర్యాదు చేయడంతో గ్రీన్ ట్రైబ్యునల్ స్పందించి చెట్ల నరికివేతపై స్టే ఇవ్వడంలో ప్రకాశ్ కృషి కూడా ఎంతో ఉంది.

● ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో దామగుండంలో రాడార్ కేంద్రం ఏర్పాటుపై పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలో త్వరలో అక్కడికి పాదయాత్రగా వెళ్లి తన గళాన్ని వినిపిస్తానని చెబుతున్నారు.



ప్రమాదాన్ని మరిచి.. చరవాణిలో నిమగ్నమై



ఇలా చూస్తుంటే అటో.. ఇటో



ఇలా రాజాలా కూర్చుంటే అంతే..

మిత్రమా.. రెప్పపాటులో చేజారుతుంది జీవితం!

రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం ఏదో ఒకచోట అలాంటి హృదయవిదారక దృశ్యాలు వెలుగుచూస్తున్నాయి. అయినా చాలా మంది ప్రయాణికులు రైలు లోపల నిల్చోవడానికి స్థలం ఉన్నా తలుపు వద్ద కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. అక్కడ ఏ ఆధారం లేకుండా ప్రమాదకరంగా నిల్చుంటారు. చరవాణిలో మాట్లాడుతుంటారు. ఇది రైల్వే చట్టాల ప్రకారం నేరం. రూ.300 జరిమానా లేదా ఏడు రోజుల జైలు శిక్ష ఉంటుంది.

ఇదీ పరిస్థితి..

గురువారం సాయంత్రం 5 గంటలకు వడ్డేపల్లి చెరువు వద్ద సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లు ఇంటర్‌సిటీని పరిశీలించినప్పుడు ప్రతి కోచ్‌లోనూ ప్రతి తలుపు వద్ద కూర్చుని ఉన్న ప్రయాణికులు కనిపించారు. వడ్డేపల్లి చెరువు వద్ద రైలు గంటకు 30 కి.మీ. వేగంతో ప్రయాణం చేస్తుండగా 'న్యూస్‌టుడే' తీసిన చిత్రాలు ఇవి..

–న్యూస్‌టుడే, కాజీపేట

కాజీపేట, వరంగల్ జీఆర్‌పీ పోలీసు స్టేషన్ పరిధిలో తలుపు వద్ద కూర్చుని జారి పడి మరణించిన వారి సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2021	13
2022	10
2023	18
2024	12

పదేళ్లలో జరగని అభివృద్ధి.. ఏడాదిలో చేసి చూపిస్తా..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాది కాలంలో చేసి చూపిస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి తనను, తన కుమార్తెను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాటలే కాకుండా దానికి సంబంధించిన ఎజెండాను ప్రకటిస్తున్నట్లుగా వివరించారు. ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అనేక అభివృద్ధి విషయాలపై గంటకు పైగా చర్చించానని చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, సమీకృత భవనాల నిర్మాణం, మొదటి దశలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పాటుగా మున్సిపాలిటీకి సంబంధించిన జీవో, డిగ్రీ కళాశాల ఏర్పాటు, దేవాదుల కాల్వల మరమ్మతులు.. తదితర అభివృద్ధి పనుల గురించి వివరించగా ముఖ్యమంత్రి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ అభివృద్ధి పనులకు అక్టోబరు చివరి వారంలో ఉత్తర్వులు వస్తాయన్నారు. వెంటనే పనులకు టెండర్లు పిలిచి.. నవంబరు 15 లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్‌కు తీసుకొచ్చి వేలమంది ప్రజల సమక్షంలో శంకుస్థాపన చేసి.. అదే రోజే ఘన్‌పూర్ మున్సిపాలిటీని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రకటించిన అభివృద్ధి పనులను 2026 జూన్ వరకు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని వెల్లడించారు. గాంధీ భవన్, ఏఐసీసీ చుట్టూ తిరిగేవారికి పదవులు రావని.. ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై.. సమస్యలు పరిష్కరించేవారికే వస్తాయని కడియం శ్రీహరి మార్క్‌గా.. దానిని ఘన్‌పూర్‌లో అమలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు పొట్లపల్లి శ్రీధర్ రావు, బెలిదె వెంకన్న, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, మంచాల ఎల్లయ్య, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొంటాం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తాము సిద్ధంగా ఉన్నామని.. వాటి గురించి తాము ఆందోళన చెందడం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉందని చెప్పారు. తనకు ప్రజాస్వామ్యం, కోర్టులు, ఎన్నికల వ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం ఉందని అన్నారు.. పదేళ్లలో 38 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న నీచ చరిత్ర కలిగిన భారాస ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని.. ఈ జిల్లాకు ఉన్న చరిత్ర, గొప్పతనాన్ని నాశనం చేయకూడదని ఎంత మొత్తుకున్నా తన మాట వినలేదని.. ఆ విషయంలో నేను ఎదురు తిరిగాను కాబట్టే రెండోసారి నాకు మంత్రి పదవి రాలేదని అన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండోస్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా నిలిచింది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు.. కేసులు నమోదు



వరంగల్‌లో ఔషధాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ వైద్యమండలి అధికారులు, వరంగల్ యాంటిక్వాకరీ బృందం గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా.. వైద్యం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తెలంగాణ వైద్యమండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ డా.నరేష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. వరంగల్ యాంటిక్వాకరీ బృందం, ఐఎంఏ, హెచ్‌ఆర్‌డీఏ జిల్లా సభ్యులు డా.వద్దిరాజు రాకేష్, డా.అన్వర్‌మియా, డా.వెంకటస్వామి, డా.అజిత్‌పాషాలు హనుమకొండలోని భీమారం, దీన్‌దయాళ్ కాలనీ, వరంగల్‌లోని రామన్నపేటలో తనిఖీలు చేశారు. పలువురు ఇష్టారాజ్యంగా యాంటిబయాటిక్ ఔషధాలు, నొప్పి నివారణ సూదులు(ఇంజక్షన్లు) ఇస్తున్నట్లు గుర్తించారు. వందల సంఖ్యలో స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్ ఔషధాలు, సూదులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అర్హత లేని వైద్యులపై ఎన్ఎంసీ 34, 54 యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు డా.నరేష్‌కుమార్ తెలిపారు. పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకొని వైద్యులు కాకున్నా.. పరిధి దాటి వైద్యం చేస్తున్న మహేందర్, జ్ఞానేశ్వర్‌లపై చర్యలు తీసుకోవాలని బోర్డుకు సిఫార్సు చేయనున్నట్లు వివరించారు.

నర్సంపేట: నర్సంపేటలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లను వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షల యాక్టుకు లోబడి పరీక్షలు చేస్తున్నారా? లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ యంత్రాలు, రోగుల వివరాల పుస్తకాలతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

క్రీడలు.. స్నేహానికి వారధులు


గెలుపొందిన కొడిశెల వాలీబాల్ జట్టుతో అధికారులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: నిత్య జీవితంలో క్రీడలు విద్యార్థుల మధ్య స్నేహానికి వారధులను నిర్మిస్తాయని మండల విద్యాశాఖాధికారి గొంది దివాకర్ అన్నారు. గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం డివిజన్‌స్థాయి ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల క్రీడోత్సవాలను కర్లపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.గాంగూనాయక్ అధ్యక్షన నిర్వహించారు. ఈ ఉత్సవాలను దివాకర్ ప్రారంభించి మాట్లాడారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే ఒక మంచి సుగుణాన్ని క్రీడలు క్రీడాకారులకు బహుమతిగా అందజేస్తాయని చెప్పారు. జీవితంలో ఎదగడానికి సవాళ్లను స్వీకరించడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అంతే కాకుండా క్రీడాకారుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి చూపించాలని కోరారు. కార్యక్రమంలో కొడిశెల ప్రధానోపాధ్యాయుడు టి.దేవదాసు, జిల్లా స్పోర్ట్స్ అధికారి యాలం ఆదినారాయణ, క్రీడల కార్యదర్శి టి.సమ్మయ్య, వ్యాయామ సంచాలకులు బి.శరత్, వి.నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్.సతీశ్, రాజు, రాంచందర్, నారాయణ, రవి. సీహెచ్.కృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

మంగపేట, న్యూస్‌టుడే: ఐటీడీఏ ఏటూరునాగారం పరిధిలోని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల ఐకాస ఆధ్వర్యంలో ఈనెల 28న ఐటీడీఏ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఐకాస నాయకులు గొప్ప సమ్మారావు, పొదెం కృష్ణప్రసాద్ ఉపాధ్యాయులను కోరారు. గురువారం మండలంలోని వివిధ గిరిజన సంక్షేమ పాఠశాలలు కోమటిపల్లి, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి ఉపాధ్యాయులను కలిసి ధర్నాకు సంసిద్ధులను చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చి నిరసన తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు పోరిక సర్వన్‌కుమార్, ములుకాల వెంకటస్వామి, కొండా చెంచయ్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతులుగా చిన్నారులు


వీఆర్‌కేపురం గ్రామంలో చిన్నారి బరువు చూస్తున్న వైద్యసిబ్బంది

వెంకటాపురం, న్యూస్‌టుడే: పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవడంతోనే చిన్నారులు ఆరోగ్యవంతులుగా మారతారని వైద్యులు సూచించారు. జిల్లా పాలనాధికారి దివాకర, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య ఆదేశాలతో వెంకటాపురం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను వైద్యశాఖ బృందాలు గురువారం సందర్శించాయి. మహితాపురం, పాత్రాపురం, మంగవాయి, ఉప్పేడు, గొల్లగూడెం, కోయబెస్తగూడెం, మరికాల, చర్ల్పేట, రాచపల్లి, బోదాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువులను కొలతలు వేసి దస్త్రాల్లో నమోదు చేశారు. బరువు తక్కువ, అతి తక్కువగా ఉన్న వారిపై ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ముత్తమ్మ, పర్యవేక్షకులు చంద్రకళ, వైద్యులు స్నేహ, ఆశీశ్, వినయ్, ఎంఎల్‌హెచ్‌పీ మనోహర్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, పోషన్ అభియాన్ బాధ్యులు పాల్గొన్నారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ


నూతన ఎంఈవో సత్యనారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖ అధికారిగా జీవీవీ సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెంకటాపురం జడ్పీహెచ్‌ఎస్ పీజీ ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్న ఆయన్ను ఐటీడీఏ ప్రభుత్వం ఎంఈవోగా నియమించింది. దీంతో ఆయన పూర్వపు అధికారి వెంకటేశ్వర్లు నుంచి బాధ్యతలను చేపట్టారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను కార్యాలయం ఉద్యోగులతో పాటు ఎస్టీయూ, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ రాంబాబు, జి.గోవర్ధన్, పి.రమణయ్య, పి.కృష్ణబాబు, కె.సంతోష్‌కుమార్, బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో..


తాళ్లపల్లి ప్రభాకర్

వెంకటాపూర్: మండలంలోని పాలంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న తాళ్లపల్లి ప్రభాకర్ మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి ఎంఈవోగా పనిచేసిన శ్రీనివాసులు స్థానంలో ప్రభుత్వం ఇటీవల ప్రతీ మండలానికి ఒకరికి కేటాయించడంతో ప్రభాకర్‌కు అవకాశం దక్కింది. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

ఏటూరునాగారంలో..


ఎంఈవో మల్లయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏటూరునాగారం: మండలంలోని కొరత ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు వీరభద్రం డిమాండ్ చేశారు. గురువారం కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంఈవో కొయ్యడ మల్లయ్యను ఆ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు వి.రాంబాబు, ఏ.రాజేందర్, ఎస్‌బీ.నాయుడు, రాజశేఖర్, సుమన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కొత్త ఎంఈవోను సన్మానించి అభినందనలు తెలిపారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి

మంగపేట, న్యూస్‌టుడే: పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంగపేట సీనియర్ పాత్రికేయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మపురి శ్రీనివాస్, నిమ్మగడ్డ శ్రీనివాస్ అన్నారు. మంగపేట సీనియర్ పాత్రికేయుడు ఎర్రం స్వామి అధ్యక్షతన గురువారం మంగపేట మండల కేంద్రంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మంగపేట సీనియర్ పాత్రికేయుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ధర్మపురి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మగడ్డ శ్రీనివాస్, సభ్యులుగా వడ్లకొండ శ్రీనివాస్, అక్కెపెల్లి రాజేశ్, ఇప్పలపల్లి రమేష్, పల్లప రమేష్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో పాత్రికేయులు కల్లెబోయిన శ్రీనివాస్, మేడ ఆదినారాయణ, ఎర్రం స్వామి, మార్త సాంబయ్య, ఇసాక్, మఠం రమేష్, కురిమిళ్ళశ్యాం, నల్లూరి మాధవ్, ఇప్పాల నరేష్, వడ్లకొండ వీరయ్య, అక్కెపెల్లి నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



వెంకటాపురం, న్యూస్‌టుడే: మండలంలోని మారుమూల గిరిజన పల్లెల్లో రెండో విడత దోమల మందు పిచికారి ప్రక్రియను గురువారం శ్రీకారం చుట్టారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వెంకటాపురం మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధికి చెందిన తిప్పాపురం గ్రామంలో ఆరోగ్య సహాయకుల ఈ రాముడు, రాజేశ్‌ల పర్యవేక్షణలో ఇంటింటికి వెళ్లి దోమల మందు పిచికారీ చేయించారు. దోమల వ్యాప్తి చెందే అవకాశమున్న ప్రాంతాల్లోనూ మందు చల్లించారు. ప్రతీ ఒక్కరూ దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, నిల్వ నీటిని ఇళ్లలో ఉంచకూడదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులు ఆదేశాలతో ఎంపిక చేసిన ప్రతీ గ్రామంలోనూ ఆల్ఫాసైపర్‌మెథిన్‌ను పిచికారి చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు మోహనకృష్ణ, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

ధీర వనిత చాకలి ఐలమ్మ..!


ములుగులో కలెక్టర్, అధికారులు, బీసీ సంఘం నాయకులు


నివాళులర్పిస్తున్న తహసీల్దారు రవీందర్, అధికారులు


తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ములుగు టౌన్, న్యూస్‌టుడే: భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం పాలకులపై పోరాటం చేసిన చాకలి ఐలమ్మ ధీర వనిత అని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ పోరాట ఉద్యమంలో చాకలి ఐలమ్మ స్ఫూర్తి గొప్పదన్నారు. జిల్లాలోని పలు కార్యాలయాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. వీరనారి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనలో తొలి భూపోరాటానికి నాంది పలికిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని, భావి తరాలకు ఉద్యమస్ఫూర్తిని అందించిన గొప్ప పోరాట యోధురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు, బీసీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని తహసీల్దారు, ఎంపీడీవో, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పంచాయతీ తదితర కార్యాలయాల్లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీందర్, ఎంపీడీవో సుమనవాణి, ప్రిన్సిపల్ అవిలయ్య, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: ఏటూరునాగారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ బాదావత్ అశోక్ నివాళులర్పించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఏటూరునాగారం రజక సంఘం నాయకులు స్థానిక వై జంక్షన్ వద్ద కార్యక్రమం జరిగింది. రజక సంఘం అధ్యక్షుడు ముక్కెర పెద్ద లాలయ్య, నాయకులు పర్వతాల లాలయ్య, ముక్కెర భిక్షపతి, సుమన్, నగేష్, లడ్డు, రవి, రాంబాబు, సురేష్, లాలయ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. రజక వీధిలో వేడుకలు జరిగాయి. పర్వతాల కుమారస్వామి, ఎల్లయ్య, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం: మండల కేంద్రంలోని విద్యావనరుల భవనం వద్ద నివాళులర్పించారు. ఎంఈవో జీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాంబాబు, సూర్యనారాయణ, లక్ష్మయ్య, ఎంఈవో కార్యాలయం ఉద్యోగులు యశోధ, ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మండల కేంద్రంలో రజక సంఘం మండల అధ్యక్షుడు నూతులకంటి రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం మహిళా అధ్యక్షురాలు పున్నం నాగలక్ష్మీ, సభ్యులు నూతుల కంటి రాధిక, కొండపర్తి రమ, రాచకొండ భారతమ్మ, రమ, వేల్పుల స్వరూప, సౌజన్య, మానస, కాంతమ్మ, మంగపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు తాటి రమణ, తదితరులు పాల్గొన్నారు.


ఏటూరునాగారం పట్టణంలో రజక సంఘం నాయకులు


వెంకటాపురంలో ఎంఈవో, ఉపాధ్యాయులు


మంగపేట మండల కేంద్రంలో..

పదోన్నతులకు ఒకే తేదీని ఖరారు చేయాలి

ములుగు, న్యూస్‌టుడే: వివిధ రకాలుగా, వివిధ తేదీల్లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులందరికీ ఒకే పదోన్నతి తేదీని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు కల్పించడంతో ఒక ఉపాధ్యాయునికి వేరు వేరు సబ్జెక్టులలో పదోన్నతి లభించిందని, దీంతో ప్రతి ఉపాధ్యాయుడు కేవలం ఒక సబ్జెక్టులో మాత్రమే చేరారని తెలిపారు.

పంపు ఆపరేటర్లకు మరమ్మతులపై శిక్షణ

వాజేడు, న్యూస్‌టుడే: మంచినీటి సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులు, మరమ్మతులపై పంపు ఆపరేటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కొనసాగుతోంది. రెండో రోజైన గురువారం శిక్షణ కార్యక్రమాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలజ సందర్శించారు. సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ విద్యుత్తు మోటార్లకు, ప్యానల్ బోర్డులు, విద్యుత్తు పరికరాలను మరమ్మతులు చేసే విధానాలను ట్రైనర్ వివరించారు. సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించారు. శిక్షణ తర్వాత పంచాయతీలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలని ఏఈ పేర్కొన్నారు.

నిధులు సమకూర్చాలని వినతి



వాజేడు, న్యూస్‌టుడే: పంచాయతీల నిర్వహణలో కార్యదర్శులు ఎదుర్కొంటున్న మానసిక, ఆర్థిక ఇబ్బందులు, సమస్యలపై ఎంపీడీవో విజయకు వినతిపత్రాన్ని అందజేశారు. నల్లగొండ జిల్లాలో పంచాయతీ ఎంపీడీవో, కార్యదర్శులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని కార్యదర్శులు విధులకు హాజరై నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిధులు లేకపోవడంతో రోజువారీ విధుల నిర్వహణ కష్టంగా మారుతోందంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు. పంచాయతీ అవసరాలకు దుకాణాల్లో తీసుకున్న అప్పులను చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు నిధులు లేవని, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ట్రాక్టరుకు అవసరమైన డీజిల్ కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న మానసిక, ఆర్థిక సమస్యలను తొలగించేందుకు నిధుల మంజూరీకి ప్రభుత్వానికి నివేదించాలంటూ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలంలోని పంచయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

ములుగు టౌన్, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడకలను జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు అన్ని సంఘాల ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇద్దరిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కేసు


పట్టుబడిన నిందితులతో ఎఫ్ఆర్వో శంకర్

ములుగు టౌన్, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో శంకర్ తెలిపారు. ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామంలో అడవి పందులను విద్యుత్తు తీగలు అమర్చి హతమర్చినట్లు తమకు సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి చేరుకోగా, గ్రామానికి చెందిన కేలోతు బాలు, భూక్య సురేష్‌లు అడవి పందులను హతమార్చి కనిపించగా, వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పంట పొలాల వద్ద కరెంటు తీగలను అమర్చినట్లు తేలిందని, ఇరువురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

డీఈవో కార్యాలయంలో రెండు ల్యాప్‌టాప్‌లు మాయం

ములుగు టౌన్, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి మంజూరైన 5 ల్యాప్‌టాప్‌ల్లో రెండు మాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5వ తేదీన డీఈఓ కార్యాలయానికి మంజూరైన ఐదు ల్యాప్‌టాప్‌లు వచ్చాయి. ఈ నెల 10వ తేదీన సిబ్బందికి ఇవ్వడానికి వచ్చిన బాక్సులను తెరిచి చూడగా, అందులో మూడు మాత్రమే ఉన్నాయని, రెండు బాక్స్‌లు ఖాళీగా ఉన్నాయి. విద్యాశాఖ అధికారి కార్యాలయంలో విధులు నిర్వరిస్తున్న ఇనుగాల సత్యానారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏకాగ్రతపై విద్యార్థులు దృష్టి సారించాలి


శ్రీ రామ్మూర్తిజీని సన్మానించిన కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపకులు

మంగపేట, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ఏకాగ్రతను పెంచుకోవాలని ఏకం ఫౌండేషన్ శ్రీ కృష్ణాజీ-శ్రీప్రీతాజీ శిష్యుడు శ్రీ రామ్మూర్తి జీ అన్నారు. గురువారం మంగపేటలోని శ్రీ ఎక్కటి సరోజినీ శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఏకం అనుగ్రహ తరగతులు నిర్వహించారు. 'ఒత్తిడిని జయించడం ఎలా' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతర్గత శక్తుల ప్రేరేపణ, విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపు, జ్ఞాపకశక్తి మెరుగుపర్చుట, పాజిటివ్ ఆలోచన విధానం గురించి వివరించారు. మూడు నిమిషాల్లో ఒత్తిడిని జయించడం, కోపం, భయం, బాధను తొలగించుకోవడంపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ సభ్యులు ఆకరవి, కళాశాల ప్రధానాచార్యులు నాయిని వీరేందర్, అధ్యాపకులు రజిత, సంతోష్‌కుమార్, జ్యోతిర్మయి, రేణుక, అనిల్, లక్ష్మణ్, శ్రీనివాస్, రవీంద్రనాయక్, చిరంజీవి, వందన, జ్వాలా ఛారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ


చల్వాయిలోని టీఎస్‌ఎస్పీ ఐదో బెటాలియన్‌లో కరపత్రాలను చూపుతున్న వైద్య సిబ్బంది

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంపొందించుకుంటే దానిని నియంత్రించడం పెద్ద సమస్య కాదని, అవగాహనే అసలైన ఆయుధమని వైద్యాధికారిణి సునిత అన్నారు. గోవిందరావుపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీమ్ సంస్థ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సునిత మాట్లాడుతూ.. గర్భిణులు తప్పనిసరిగా హెచ్ఐవీ, ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ, ఏ మార్గంలో వస్తుందో ఎవరికీ తెలియదన్నారు. అనంతరం చల్వాయి గ్రామంలోని టీఎస్ఎస్పీ ఐదో బెటాలియన్‌లో కూడా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెటాలియన్‌లో వైఆర్‌జీ కేర్ సంస్థ ప్రతినిధులు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, ఐసీటీసీ కౌన్సిలర్ జె.కుమార్‌సింగ్, లింక్ వర్కర్ టి.కిషన్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'


సమావేశంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు

ములుగు, న్యూస్‌టుడే: ఏజెన్సీ గ్రామాల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. గురువారం ములుగు మండలం జగ్గన్నగూడెంలో నిర్వహించిన సీపీఎం గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవించే గిరిజనులకు పట్టాదారు పాసు పుస్తకాలు రాలేదని, పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగ్గన్నపేట గ్రామస్థులకు ఇప్పటి వరకు తునికాకు బోనస్ రాలేదని, అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రత్నం రాజేందర్, మండలాధ్యక్షుడు ఎండి. గఫూర్ పాషా, నాయకుడు గుండెబోయిన రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక: జగ్గన్నగూడెం సీపీఎం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా దబ్బగట్ల శోభన్, సభ్యులుగా సునిల్, వెంకటేశ్వర్లు, శ్రీను, కిషోర్, కిరణ్, సారయ్య సాంబయ్య, రాజు, నారాయణ ఎన్నికయ్యారు.

భారీ వర్షం.. పనులకు ఆటంకం



వాజేడు, న్యూస్‌టుడే: వాజేడు మండలంలో గురువారం భారీ వర్షం కురవడంతో.. వ్యవసాయ పనులతో పాటు ఇతరత్రా పనులకు ఆటంకం ఏర్పడింది. మండల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాల్లో ఎక్కువగా మిరప సాగు చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా మధ్యాహ్నం సమయంలో కురుస్తోంది.

మాజీ సర్పంచి కుటుంబానికి ఆర్థిక సాయం



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: శివాపురం మాజీ సర్పంచి యాలం రాంబాబు ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి భారాస జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు రూ. 21 వేలతో పాటు క్వింటాల్ బియ్యాన్ని సమకూర్చారు. భారాస మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు తాడూరి రఘు, కిరణ్, భాస్కర్‌రావు, చంద్రబాబు, శేఖర్, భోజారావు, రామకృష్ణ, ఎం.రాంబాబు, ముస్తఫా, రాజు, నాగసాగర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు డిపో ఏర్పాటు చేయాలి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: రోడ్డు రవాణా సంస్థ వరంగల్ ప్రాంతీయ మేనేజర్ ఉదయ్‌భానును ఏటూరునాగారం మాజీ ఎంపీపీ, భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాడి రామరాజునేత గురువారం కలిశారు. ఏటూరునాగారంలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటుపై చర్చించారు. ఇక్కడ డిపో ఏర్పాటు చేస్తే కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రజలకందే సేవలపై వివరించారు. స్పందించిన ప్రాంతీయ మేనేజర్ ఏటూరునాగారంలో రోడ్డు రవాణా సంస్థ బస్సు డిపో ఏర్పాటుపై తమవంతు సాకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపల్ అంకయ్య, ఉపాధ్యాయులు

ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం మల్లంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి డి.శమంత్ జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన 8వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అంకయ్య తెలిపారు. జమ్మకశ్మీర్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో ఈనెల 30 నుంచి జరగనున్న పోటీల్లో శమంత్ పాల్గొంటారని వివరించారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపల్‌తో పాటు వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.ప్రశాంత్, వైస్ ప్రిన్సిపల్ రహీం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శోభన్‌బాబు తదితరులు అభినందించారు.

ప్రయాణాల్లో నిబంధనలు తప్పనిసరి


వాహన పత్రాన్ని పరిశీలిస్తున్న శిక్షణ ఎస్ఐ మహేష్

వెంకటాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని తాళ్లపహాడ్‌లో శిక్షణ ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఎలాంటి పత్రాలు లేనివారికి జరిమానా విధించారు. అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దన్నారు. ప్రయాణాల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.